

మానసిక ఆరోగ్యం పై అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి:స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సమిధ సంస్థ అధ్వర్యంలో ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటివకూ సుమారు మూడు జిల్లాల్లో 62 క్యాంపులు ద్వారా 4450 మందికి అవగాహన కల్పించామని సమిధ సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాగంగా సోమవారం అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 100 విద్యార్థులకు అవగాహన కల్పించి ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బుద్ధ రాజు, సింహాద్రి, అప్పలరాజు, దేముడమ్మ, చంటి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన టెన్త్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని పాడేరు రంపచోడవరం డివిజన్ల లో 65 పరీక్షా కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 11,286 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావలసి ఉండగా..10,985 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 295 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాస్ కాపీయింగ్ జరగకుండా నిఘా చర్యలు చేపట్టారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించారు. తొలి రోజు పరీక్షలో డీబార్స్ వంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. 11 సిట్టింగ్ స్క్వాడ్, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షించాయి. టెన్త్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు విలేకరులకు తెలిపారు.



రాజవొమ్మంగిలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

టెన్త్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని, ఎటువంటి అసౌకర్యం కలగనీయరాదని, పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం కల్పించవద్దన్నారు. కలెక్టర్ స్థానిక తహశీల్దార్ సత్యనారాయణ, సీఐ సన్యాసినాయుడు, ఎస్ వెంకయ్య సిబ్బంది ఉన్నారు.



పాడేరులోని శ్రీకష్ణాపురం పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



జెండా ఆవిష్కరణ చేసి నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, పుంగుట్ట గ్రామస్తులు

వైసిపి నుండి 35 కుటుంబాలు

సిపిఎం ప్రజా సంఘాల్లో చేరిక

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని పేగా పంచాయతీ పరిధి పుంగుట్ట గ్రామంలో వైసిపికి చెందిన 35 కుటుంబాలు సోమవారం సిపిఎంలో చేరాయి. వారికి సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆదివాసీల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎంలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు బిర్దశరమయ్య, దూలయ్య సోమేష్ ఆధ్వర్యంలో గ్రామంలో సిపిఎం జెండాను ఆవిష్కరించారు. ఆదివాసీలకు అండ ఎర్ర జెండా అంటూ నినాదాలు చేశారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ ఆదివాసీల చట్టాలు సక్రమంగా అమలు జరగాలంటే ఎర్రజెండా ప్రజా ప్రతినిధులు ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వేక రాజకుమార్, సిపిఎం నాయకులు ముట్టం రాజయ్య, లెనిన్ పొద్దయ్య, ముచ్చిక గంగయ్య, మడకం దూలయ్య, కొండుయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికల విధులకు ప్రత్యేకంగా కేటాయించబడిన అధికారులందరూ ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతి కోరారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో డిఆర్‌ఓ మాట్లాడుతూ, వివిధ దినపత్రికలలో వచ్చిన వార్తలు, ఫిర్యాదుల విభాగానికి వచ్చే ఫిర్యాదులు, సివిజిల్‌కు వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు వెంటనే స్పందించి నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా నోడల్ అధికారులు నివేదికలను పంపేందుకు అవసరమైన నిర్ణీత ప్రోఫార్మాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫోటోలు, రాతలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలన్నారు. విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. అందుకు అవసరమైన సమాచారాన్ని సంబంధిత నోడల్ అధికారులకు తెలియజేయాలన్నారు. వివిధ నోడల్ అధికారులకు కేటాయించిన సిబ్బంది హాజరును పరిశీలించిన డిఆర్‌ఓ విధులను వివరించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.అంబేద్కర్, భవాని, మీడియా మోనటరింగ్ నోడల్ అధికారి పి.గోవింద రాజులు, కమ్యునికేషన్ నోడల్ అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, సివిజిల్ మోనటరింగ్ నోడల్ అధికారి కే.సాయి నవీన్, వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి పిఎస్ కుమార్, ఫిర్యాదుల నోడల్ అధికారి ఎం.వి.రామకృష్ణరాజు, సోషల్ మీడియా నోడల్ అధికారి పి.రాములు, సీజర్ నోడల్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రెవిన్యూ అధికారి పద్మావతి

పకడ్బందీగా అమలు: పిఓ అభిషేక్:

అరకులోయ:అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అములు చేయాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ స్పష్టం చేసారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహిం ఎన్నిక ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ రోజున అభ్యర్దులు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించ కూడదన్నారు. పోలింగ్ కేంద్రాలకు రవాణా ఇబ్బందులుంటే అధికారులు సదుపాయాలు కల్పించాలని సూచించారు.పోస్టర్లు, హోర్డింగ్స్ తొలగించడంపై విధిగా రిజిష్టరులో నమోదు చేయాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై ప్రచార కరపత్రాలు, గోడ పత్రికలను అతికించ కూడదన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల నియమావళిపై ఎన్నికల సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు.అప్రమత్తంగా ఉంటూ విధులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దారులు, ఎంపిడిఓలు, సెక్టర్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:స్థానిక కేజీబీవీ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్లైన్‌లో ఆహ్వాని స్తున్నామని, ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక కేజీబీవీ పాఠశాల ఎస్ఓ ప్రిన్సిపాల్ కె.భవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కేజీబీవీ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఏప్రిల్ 11 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్‌లో 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. మరింత సమాచారం కొరకు స్థానిక కేజీబీవీ పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఘనంగా జంగమయ్య జాతర

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో జంగమయ్య జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జాతర మహోత్సవాలను పంచాయతీ సర్పంచ్ జి.నాగేశ్వరరావు, గ్రామపెద్దలు ప్రారంభించారు. జంగమయ్య స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. థింసా నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి తదితరులు

రేఖపల్లి పిహెచ్‌సిల్లో అవకతవకలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- విఆర్.పురం

మండల కేంద్రం రేఖపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ చేపట్టి, బాధ్యులైన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పుల్లయ్యకు ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి విన్నవించారు. సోమవారం రేఖపల్లి వచ్చిన డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్యను ఎంపీపీ లక్ష్మి, జెడ్పిటిసి రంగారెడ్డి, ఇతర నాయకులు కలిసి స్థానిక డాక్టర్లపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పిటిసి మాట్లాడుతూ పిహెచ్‌సి వైద్యుల బాధ్యతా రాహిత్యంతో గతంలో చిన్నారి పుట్టిన కొన్ని దినాల్లో మృతి చెందిందని, డాక్టర్ వైద్యం చేయకుండా ఫోన్లో మాట్లాడుకుంటూ సమయాన్ని సాగదీయడం వలనే ఆ చిన్నారి మృతి చెందిందని అప్పట్లో పత్రికల్లో వచ్చిందని పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక ఎంపీటీసీ ఈ విషయంపై వివరణ అడిగినప్పుడు సంబంధించిన డాక్టర్ మాట్లాడలేదని పేర్కొన్నారు. పైగా డ్యూటీలో ఉన్న మరో డాక్టరు వాళ్లకి ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు అందుకే ఈ అమ్మాయిని కావాలని వాళ్ళే ఏదో చేసి ఉంటారని అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. డాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలని, రోగులను కాపాడాలని కోరారు. డాక్టర్లపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని వారికి డిప్యూటీ డిఎమ్‌హెచ్ఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు పంకు సత్తిబాబు, సర్పంచ్ వెట్టి లక్ష్మి, కారం సుందరయ్య, టిడిపి నాయకులు బురక కన్నారావు, బీరాక సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా శంకరరావు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వి.శంకర రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్‌గా, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న శంకరరావుకు ఇటీవల ప్రభుత్వం ప్రిన్సిపల్‌గా ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యని అందించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



శంకరరావును సన్మానించిన అధ్యాపకులు

గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే చర్యలు

సిఐ రమేష్‌కుమార్



ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రుల్లో సంచరిస్తున్నారని స్థానికులు ఎస్సైకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో గత మూడు రోజులు అర్ధరాత్రి వేళలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ విషయమై సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ సోమవారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,అర్ధరాత్రులు గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడే వ్యక్తులు సంచరిస్తున్నారని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను గిరిజనులు దేహ శుద్ధి చేసి సంబంధిత పోలీస్ స్టేషన్లలో అప్పగించారని తెలిపారు. మండలవాసులు అప్రమత్తంగా ఉండి అర్ధరాత్రి సంచరిస్తున్న వారిపై సమాచారం అందించాలని తెలిపారు.



పాడేరులో తుపాకులు అప్పగించిన గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న సిఐ

తుపాకులు స్వచ్ఛందంగా అప్పగించాలి

-పాడేరు సిఐ నవీన్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: నాటు తుపాకులను స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌లలో వారం రోజుల్లో అప్పగించాలని, స్వచ్ఛందంగా తీసుకొచ్చి అప్పగించిన వారిపై ఎటువంటి కేసు ఉండదని పాడేరు సిఐ డి.నవీన్ కుమార్ తెలిపారు.. పాడేరు మండలం కుజ్జెలి పంచాయతీకి చెందిన ముగ్గురు, ఇస్కలు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పోలీసుల పిలుపు మేరకు స్పందించి ఐదు నాటు తుపాకులను తీసుకొచ్చి అప్పగించినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా పోలీసు యంత్రాంగం పిలుపుతో నాటు తుపాకులు అప్పగించారని అన్నారు. వారిని సిఐ అభినందించారు. ఇంకా ఎవరి వద్దనైనా నాటు తుపాకులు, తపంచాలు కలిగి ఉంటే వాటిని పోలీసు స్టేషన్ లో అప్పగించాలని కోరారు. ఇచ్చిన గడువు లోపల అప్పగించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

8 నాటు తుపాకీలు అప్పగింత

రాజవొమ్మంగి:మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పలు గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు ఎనిమిది నాటు తుపాకీలను సోమవారం అప్పగించినట్లు రాజవొమ్మంగి సిఐ ఎన్ సన్యాసినాయుడు తెలిపారు. నాటుతుపాకులు, లైసెన్స్ లేని ఆయుధాలు ఎవరిదగ్గరైనా ఉంటే వారం రోజుల లోపు సంబంధిత పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛందంగా డిపాజిట్ చేయాలని ఇటీవల జిల్లా పోలీసులు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కింద్ర గ్రామం నుండి 2 నాటుతుపాకులు, జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో వాతంగి, ఓకుర్తి గ్రామాల నుండి 6 నాటుతుపాకులను స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేశారు. రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు వెంకయ్య, రఘునాథరావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అల్లూరి జిల్లా కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి-రంపచోడవరం

రానున్న సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, సంబంధిత అధికారులను అల్లూరి జిల్లా కలెక్టర్ యం.విజయ సునీత ఆదేశించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఈవీఎంలు భద్రపర్చే స్ట్రాంగ్ రూమును కలెక్టర్ విజయ సునీత, జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణం నుండి ఎన్నికల అధికారులకు, ఎన్నికల సిబ్బందికి ఎన్నికలకు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్ నుండి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు ఒక సీరియల్ ప్రకారం తీసుకురావాలని సూపర్వైజర్లను ఆదేశించారు. సెక్టార్ అధికారులు తమకు కేటాయించిన రూట్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈవీఎంలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ చుట్టుపక్కల బారికేడ్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. అనంతరం లెనోవా కాలేజీ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పరిశీలించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, సిఐలు వెంకటేశ్వరరావు, రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్లు యన్‌వివి సత్యనారాయణ, సుబ్బారావు, శ్రీధర్, చైతన్య, శివ, విశ్వనాథం, సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రావు, ఆర్ఐ విగ్నేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య, వీఆర్వోలు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎస్‌పి తుహిన్ సిన్హా, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఎన్నికల ఏర్పాట్లుపై సమావేశం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లుపై జిల్లా కలెక్టర్ యం.విజయ సునీత సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా ఎస్‌పి తూహిన్ సిన్హా, రంపచోడవరం ఐటిడిఏ పిఓ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఏర్పాట్లు మ్యాప్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి రంపచోడవరం

ఐక్య పోరాటాలతోనే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారమవుతాయని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. రంపచోడవరంలో ఆశవర్కర్ల యూనియన్ విస్తృత సమావేశం సోమవారం మట్ల వాణిశ్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆశా వర్కర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడి వల్ల ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి బెదిరింపులకు భయపడకుండా ఐక్య పోరాటాలకి సిద్ధపడితే తప్పా సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. 66 రోజుల దీక్షలు సందర్భంగా ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. దీక్షల కాలం నాటి వేతనాలు, చనిపోయిన వారి కుటుంబాకులకు ఉద్యోగం, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాటాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమని దోచుకుంటున్నాయని, కనీస వేతనాలు ఇవ్వకుండా గొడ్డు చాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు చెల్లాయమ్మ, రమణమ్మ, రాధమ్మ, లక్ష్మి, వెంకటలక్ష్మి, మార్త, మంగ, నారాయణ, నాలుగు మండలాల ఆశవర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనలక్ష్మి, వేదికపై వెంకట్, వాణిశ్రీ తదితరులు

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-చింతూరు : మండలం లక్కవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షిల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)లో ఆ పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ సాంకేతిక నిర్వహణ ఏజెన్సీ వారు భూసార పరీక్షలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పిడి జ్యోతిర్మయి మాట్లాడుతూ పంటల దిగుబడి పెంచడంలో మట్టి నమూనా పరీక్షలు రైతులకు ఎంతో ముఖ్యమని, భూసార పరీక్షలు వలన మట్టిలోని పోషకాలు విలువలు, భూమి ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఒక పంట వేసుకునే రైతులు మార్చి నుంచి ఏప్రిల్ మాసంలోనూ, రెండు పంటలు వేసుకునే వరి రైతులు మేలోనూ భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టెక్నికల్ ఏవో సరళ మాట్లాడుతూ చెట్ల నీడలోనూ, గట్ల దగ్గర, పెంట కుప్పల్లోనూ, సేంద్రియ ఎరువులు దగ్గర మట్టి సేకరణ చేయరాదని సూచించారు. సైన్స్ ఉపాధ్యాయులు కె.తమ్మయ్య స్కూల్ విద్యార్థులను సమీప లక్కవరం గ్రామంలోని వరి పొలాల్లోకి తీసుకెళ్లి క్షేత్ర ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపల్ కె.స్వామి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మట్టి నమూనాల సేకరణ గురించి విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

పటిష్ట భద్రత నడుమ టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

మారేడుమిల్లి : మండల కేంద్రంలోని ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు ఏడు పాఠశాలల నుండి 255మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, పదిమంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు సూపరింటెండెంట్ ఎం శ్రీరాములు దొర తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్మెంటల్ ఆఫీసర్ బంధం రాంబాబు దొర, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండల కేంద్రం రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ఆశ్రమ పాఠశాల, సింగంపల్లి ఆశ్రమ పాఠశాల, జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం జరిగిన టెన్త్ పరీక్షలకు 451 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 440 మందే వచ్చినట్లు ఎంఈఓ సూరారెడ్డి తెలిపారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు నడుమ పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యాన పరీక్ష కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్ అమలు చేశారు. సీలేరు ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు 68 మంది, డిఏవి పాఠశాల విద్యార్థులు 23 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 35 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. దారకొండ గిరిజన సంక్షేమ శాఖ బాలురు పాఠశాల విద్యార్థులు 29 మంది, సప్పర్ల ఆశ్రమ బాలురు పాఠశాల నుండి 22 మంది జీకే వీధి మండల కేంద్రంలో పరీక్ష కేంద్రానికి హాజరయ్యారు. జీకే వీధి పరీక్షా కేంద్రంలో సిఐ అప్పలనాయుడు ఎస్సై అప్పలసూరి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షల్లో 553 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 532 మంది పరీక్షలకు హాజరయ్యారు. 21 మంది గైర్హాహాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 97 మందికి గాను 96 మంది, గాంధీనగర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో 125 మందికి 119 మంది, గురుకుల పాఠశాలలో 181 మందికి 169మంది, కొత్తూరు ఆశ్రమ బాలురు పాఠశాల-1లో 137 మందికి 135 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి బాబూరావు పడాల్ తెలిపారు.

దుంబ్రిగుడ:మండలంలో మూడు గవర్నమెంట్ హై స్కూల్స్, 8 ఆశ్రమ పాఠశాలలతో పాటు కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆశ్రమ బాలుర పాఠశాల, గవర్నమెంట్ హైస్కూలు, స్థానిక ఆశ్రమ బాలికల పాఠశాలలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. 426 మంది విద్యార్థులు హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారని స్థానిక ఎంఈఓ ఎస్ సుందర్రావు తెలిపారు.

పెదబయలు: మండల కేంద్రంలో మూడు కేంద్రాలలో 615 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇంచార్జి ఎస్ఐ బొబ్బిలి లక్ష్మణ్‌రావు బందోబస్తును ఏర్పాటు చేశారు.

హుకుంపేట: మండలంలోని రెండు సెంటర్లలో 676 అంది విద్యార్థులకు గాను 657 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. బాకూరు సెంటర్ నుండి 147 మంది విద్యార్థులకు గాను 138 మంది విద్యార్థులు హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారు. హుకుంపేట సెంటర్ నుంచి 529 మంది విద్యార్థులు హాజరు కాగా 10 మంది విద్యార్థులు హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారి సోమేలి చెల్లయ్య పేర్కొన్నారు.

అరకులోయ :అరకు లోయలో టెన్త్ పరీక్షలను ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. కంఠాబంసు గుడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలలో పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అల్లూరి జిల్లా అబ్జర్వర్ ఆర్‌జెడి జ్యోతి కుమారి మండలంలోని కొత్త బల్లు గూడ రెగ్యులర్ పరీక్ష కేంద్రం, అరకు లోయ హై స్కూల్, సిఎ హెచ్ స్కూల్ సెంటర్లను పరిశీలించారు. అనంతగిరి మండలంలోని నాలుగు సెంటర్లను కూడా తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పిఓ

చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

- సత్యనారాయణపురంలో దొంగతనానికి యత్నం
- అడ్డుకున్న యువకుడిపై రాడ్లతో దాడి
- చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న భరద్వాజ్
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విశాఖ సిపి
- గ్యాంగ్‌ను పట్టుకోవడానికి ఆరు బృందాలు ఏర్పాటు
- క్లూస్ టీమ్, పోలీస్ డాగ్‌తో ఆధారాల సేకరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిపి

ప్రజాశక్తి - డెంకాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని చింతలవలస ఐదో బెటాలియన్ మెయిన్ గేట్‌కి ఎదురుగా ఉన్న సత్యనారాయణపురంలో ఆదివారం అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఒక ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసింది. రూమ్‌లో నిద్రిస్తున్న భార్యాభర్తలను భయపెట్టి వారి వద్ద ఉన్న నగలను దోచుకోవడానికి ప్రయత్నించింది. ఈ సమయంలో వారు కేకలు వేయడంతో భర్తను రాడ్లతో కొట్టి పరారయ్యారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సత్యనారాయణపురానికి చెందిన యారపాటి రమణమూర్తి దంపతులకు లక్ష్మీభరద్వాజ్ అనే కుమారుడు ఉన్నాడు. భరద్వాజ్‌కు ఏడాది క్రితం పెళ్లయింది. కుమారుడు, కోడలు ఒక గదిలో నిద్రిస్తుండగా, మరో గదిలో ఇంటి యజమాని రమణమూర్తి, తన భార్య నిద్రిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో వీరి ఇంట్లో నలుగురి గ్యాంగ్ చొరబడింది. ఇద్దరు బయట ఉండగా, మరో ఇద్దరు ప్రధాన ద్వారానికి మిషన్‌తో రంధ్రం పెట్టి లోపలి గడియను తొలగించారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి భరద్వాజ్ దంపతులు నిద్రిస్తున్న రూమ్‌లోకి వెళ్లారు. అలజడి కావడంతో కోడలికి మెలకువ వచ్చింది. వెంటనే పక్కనే ఉన్న భర్తకు చెప్పింది. భర్త నిద్ర లేచి దొంగలను చేసి కేకలు వేయడంతో వారి వద్ద ఉన్న రాడ్లతో భరద్వాజ్ తలపై తీవ్రంగా కొట్టారు. ఇంతలో ఎదురుగదిలో నిద్రిస్తున్న తండ్రి రమణమూర్తి, తల్లి లేచి కరెంటు సమస్యో ఏమో అనుకుని మీటర్ స్విచ్ ఆఫ్ చేశారు. ఈ చీకట్లో దొంగలు బయటకు వెళ్లిపోయి, మళ్లీ లోపలికి వచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు నలుగురూ కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి దొంగలు పరారయ్యారు. అయితే వస్తువులేవీ చోరీకి గురికాలేదు.

అంతా ప్లాన్ ప్రకారమే..

ముందుగా గ్యాంగ్ ప్లాన్ ప్రకారం ఇంటికి రావడానికి ఇనుప కంచె కట్టర్‌తో కట్ చేసి ముందుగా తోవ ఏర్పాటు చేసుకున్నారు. చుట్టుపక్కల ఉన్న ప్రతి ఇంటి తలుపులకు ముందుగానే దొంగలు బయట గడియలు పెట్టేశారు. అనంతరం ఇంట్లోకి దొంగతనానికి ప్రవేశించి అడ్డు వచ్చిన భరద్వాజ్‌పై దాడి చేశారు. గాయాలపాలైన భరద్వాజ్ స్పృహ కోల్పోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఇలాంటి దొంగతనం ఈ ప్రాంతంలో తొలిసారి జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

సిపి రవిశంకర్ పరిశీలన

ఈ గ్రామం పద్మనాభం మండలం, విశాఖపట్నం అర్బన్‌లో ఉంది. దీంతో సంఘటనా స్థలాన్ని విశాఖపట్నం సిపి రవిశంకర్, జాయింట్ కమిషనర్ పకీరప్ప, డిసిపి-1 విజయ మణికంఠ, క్రైమ్ డిసిపి వెంకటరత్నం.. సోమవారం పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ ఆధారాలను సేకరించింది. దొంగతనంపై కుటుంబ సభ్యులనడిగి తెలుసుకున్నారు.

ఆరు బృందాలు ఏర్పాటు

దొంగలను పట్టుకునేందుకు ఆరుగురు సిఐల ఆధ్వర్యంలో ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో రామభద్రపురంలో రెండు రోజుల క్రితం జరిగిన దొంగతనం... తాజాగా సత్యనారాయణపురం ఘటన ఒకే మాదిరిగా ఉన్నాయని, ఈ రెండు చోరీలకు ప్రయత్నించిన వారు ఒకే గ్యాంగ్ అని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇది చెడ్డీగ్యాంగ్ పనేనని పోలీసులు తెలిపారు. ఒకప్పుడు ఇంట్లో ఎవరూ లేకపోతే దొంగతనాలు జరిగేవని ఇప్పుడు ఇంట్లో మనుషులున్నా దొంగలు ప్రవేశించి అడ్డొస్తే వారిపై దాడి చేసి దొంగతనాలకు పాల్పడడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసు బెటాలియన్‌కు కూతవేటు దూరంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను కొట్టి దొంగతనానికి పాల్పడడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పోలీస్ గస్తీ ఉండేదని, ఇప్పుడు అటువంటిదేమీ కనబడకపోవడంతోనే ఇటువంటి దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసు గస్తీని పెంచాలని పలువురు కోరుతున్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు : ఆర్ఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎన్నికల ప్రవర్తన నియామావళిని పటిష్టంగా అమలు చేయాలని నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. గీతాంజలి ఆదేశించారు. నక్కపల్లిలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎలక్షన్ డీటీ చైనులు, డిటి సత్యనారాయణ సహా పలు శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో వున్నందున ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరికీ ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, చెకోపోస్టుల తనిఖీ బృందం, వీడియో కవరేజ్ బృందాలు, సెక్టార్, రూట్ ఆఫీసర్లకు ఆమె పలు సూచనలు చేశారు. రాజకీయ పార్టీల ప్రకటనల బోర్డులను పూర్తి స్థాయిలో తొలగించాల్సివుందని, ఎవరైనా తొలగించకపోతే వాటిని తొలగించి, అందుకయ్యేఖర్చు వారి నుంచి సంబంధిత రాజకీయపార్టీ పేరుతో నమోదు చేయాల్సి వుంటుందన్నారు. నియోజకవర్గంలో అభ్యర్థుల ప్రచార వాహనాలకు ముందుగా ఆర్వో అనుమతులు ఉండాలని తెలిపారు. ఎన్నికల బహిరంగసభలకు కూడా అనుమతులు తప్పనిసరన్నారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల పరిధిలో రాజకీయ ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయకూడదన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి సెక్టార్ అధికారులతో ఆర్డీవో జయరాం సమావేశం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, సచివాలయాల వద్ద ఉన్న ప్రభుత్వ పథకాల పోస్టర్లను తొలగించాలన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీరాములు, టౌన్ సీఐ కాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామ అంబేద్కర్ యూత్ మన వాళ్ళకోసం మనం ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు నర్సీపట్నంకు చెందిన మద్ర శ్రీహరికి రూ.40వేల ఆర్థిక సాయం అందజేశారు. సెంట్రింగ్ పనిలో రెండు అంతస్తుల బిల్డింగ్ పైనుంచి శ్రీహరి పడి పోవడతో మంచానికి పరిమితమైన కుటుంబ సభ్యులను ఆర్గనైజేషన్ సభ్యులు పరామర్శించి ఈ ఆర్థిక సాయాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ కోశాధికారి దొండా రమేష్ మాట్లాడుతూ, మావాళ్ల కోసం మాత్రమే సహాయం చేయాలన్న ఆలోచనతో పెట్టిన ఆర్గనైజేషన్ ఎవరో తెలియకపోయినా అవసరమైన వారికి సహాయం చేయడం అనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు సరిసా అశోక్, వీరబాబు, చిట్టియ్య, సంతోష్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి పాయకరావుపేట:సమిధ సంస్థ అధ్యర్యంలో ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ సహకారంతో మానసిక ఆరోగ్యంపై పాయకరావుపేటలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇప్పటివకూ సుమారు మూడు జిల్లాల్లో 60 క్యాంప్స్ ద్వారా 4350 మందికి అవగాహణ కల్పించామని సమిధ సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాగంగా పాయకరావుపేటలోని గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లపై విచారణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామంలో వాలంటీర్స్ ఎన్నికల ప్రచారంపై ఎంపిడిఒ రత్నకుమారి ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాలంటీర్స్ ప్రచారం చేయడంపై విచారణ చేపట్టామని, కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.సచివాలయ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శిలాఫలకాలపై అసంపూర్తిగా బ్లాక్ చేయడంపై ఆమె సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. దగ్గరుండి విగ్రహాలను పూర్తిగా కప్పించారు. మొక్కుబడిగా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, ఈఓపిఆర్‌డి, పోలీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

620 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 620 మందిని బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 31 పంచాయతీల పరిధిలో ఎలాంటి గొడవలు తలెత్తకుండా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన 620 మందిపై ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్సై తెలిపారు.

జెకెసిటి ఆధ్వర్యాన నిత్యావసరాల పంపిణీ



ముస్లిములకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి- చింతూరు

రంజాన్ మాసం సందర్భంగా పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌ఘడ్‌లోని సుకుమా జిల్లా కుంట గ్రామంలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 75 పేద, మధ్య తరగతి ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఆయుర్వేద వైద్యుడు జమాల్ ఖాన్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఒక్కో కుటుంబానికి 10 కేజీలు బియ్యం, కేజీ పంచదార, కేజీ కందిపప్పు, కారం, పసుపు, మంచి నూనె తదితర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ నెలలో ఉపవాసాలు ఉంటున్న నేపథ్యంలో పేద మధ్యతరగతి కుటుంబాలకు జీవనోపాధి కొంత ఇబ్బందిగా ఉంటున్న క్రమంలో వారికి వెసులుబాటు కల్గించేందుకు ఈ సరుకులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొంట మసీదు సదర్ అధ్యక్షులు వహిదుల్లా ఖాన్, జెకెసి ట్రస్టు సభ్యులు అజీజ్ బాబు భాయ్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన కంచర్ల, గంపల



సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన కంచర్ల, గంపల

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరానికి చెందిన డాక్టర్ కంచర్ల అచ్యుతరావు సోమవారం అమరావతిలో సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ కంచర్ల అచ్యుతరావు రియల్ ఎస్టేట్ వ్యాపారి. గతంలో ప్రజారాజ్యంలో క్రియాశీలకంగా పనిచేసి,కొన్నేళ్ళుగా తూర్పు నియోజకవర్గంలోను, ముఖ్యంగా ఆరిలోవ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు

సీతమ్మధార: టిడిపి సీనియర్ నేత గంపల వెంకట రామచంద్రరావు, ఆయన సతీమణి సంధ్యా రాణి సోమవారం ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. టిడిపి విశాఖపట్నం సౌత్, ఈస్ట్ ఎలక్షన్ ఇంచార్జిగా పనిచేసిన రామచంద్రరావు, గతంలో ఎపిసిసి జాయింట్ సెక్రటరీగా, ఒబిసి వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. సెన్సార్ బోర్డు మెంబర్‌గా, పోర్ట్ ట్రస్ట్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు. కార్యక్రమంలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వైజాగ్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు.ఉన్నారు.

లక్షలు ఖర్చు.. నెరవేరని లక్ష్యం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనులు పూర్తికాకుండానే రూ.21 లక్షలు డ్రా

ప్రజాశక్తి-అడ్డతీగల

ఏజెన్సీల్లోని ప్రభుత్వ విద్యా సంస్థల రూపురేఖలు మార్చేందుకు నాడు-నేడు పథకం కింద లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పాఠశాలలు, కళాశాలల్లో పనులు పూర్తి చేయకుండానే, నిధులు డ్రా చేసుకుంటున్న వైనం దర్శనమిస్తోంది. అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నాడు -నేడు పనులను పరిశీలిస్తే ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి నాడు-నేడు కింద నిధులు మంజూరయ్యాయి. అయితే గుత్తేదారులు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై తమకు ప్రయోజనం చేకూరే పనులను చేపట్టి, ఏ ఒక్క పని పూర్తికాకుండా రూ.21 లక్షలు చేసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులు నిర్మాణం మధ్యలోనే ఆగిపోయాయి. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో కొంతమంది జూనియర్ కాలేజీ సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. కాని ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా ప్రభుత్వం రెండో విడతగా మరో రూ.8.50 లక్షలు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని ఏ విధంగా స్వాహా చేయాలనే ఖర్చు చేయాలనే దాట్లో నిమగ్నమయ్యారే తప్ప, విద్యార్థులకు ఉపయోగపడే పనులను మాత్రం ఏమాత్రం చేయడం లేదు. దీనిపై వివరణ కోరేందుకు ఫోన్ చేయగా, వారు చర్వాణి నిలుపుదల చేశారు. దీనిపై ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ జూనియర్ కాలేజీ జరుగుతున్న నాడు నేడు పనులు పలు అనుమానాలకు తావిస్తుందని చెప్పారు. గుత్తేదారులను పూర్తిగా తొలగించాలని, వారితో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని గతంలో తెలియజేసినా, ప్రస్తుత ఇంజనీరింగ్ అధికారులు వారితోనే పనులు చేయించాలనుకోవడం వారి యొక్క చేతివాటానికి నిలువెత్తు నిదర్శనంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డివిజన్ స్థాయి, జిల్లాస్థాయి అధికారులు స్పందించి దర్యాప్తు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, గదుల నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.



అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

న్యాయవాద వృత్తిలో లీగల్ డ్రాఫ్టింగ్ కీలకం

- ఎపి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు

ప్రజాశక్తి -మధురవాడ : న్యాయవాద వృత్తిలో రాణించాలనుకునే యువత లీగల్ డ్రాఫ్టింగ్‌పై పట్టు సాధించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు సూచించారు. సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రతిభావంతమైన కేసు రచన సరళమైన భాషతో, చెప్పదలచుకున్న విషయాలను తగిన ఆధారాలతో ఉండాలన్నారు. లీగల్ డ్రాఫ్టింగ్‌లోని బలమైన అంశాలకు న్యాయస్థానాలలో ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో ఉదాహరణ సహితంగా వివరించారు. వివిధ రకాల లీగల్ డ్రాఫ్టింగ్ పద్ధతులను తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. గీతంలో న్యాయవిద్య కోర్సుల బోధనా విధానం అత్యుత్తమంగా ఉందని అభినందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ కేసులలో కక్షిదారులకు సరైన న్యాయం జరగాలంటే డ్రాఫ్టింగ్ లోపాలు ఉండకూడదన్నారు. చట్టాలు, వివిధ తీర్పుల పట్ల లోతైన అవగాహన, పరిశీలన అవసరమన్నారు. లీగల్ డ్రాఫ్టింగ్ నైపుణ్యాలకు గీతం న్యాయ కళాశాల అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ సోమయాజులు

బిజెపి పాలనలో పరిశ్రమలు ప్రైవేటుపరం

ప్రజాశక్తి -గాజువాక : కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వరంగ పరిశ్రమలను నెలకొల్పితే, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటొక్కటిగా ప్రయివేటుకు ధారాదత్తం చేస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంప గోవిందరాజులు అన్నారు. సోమవారం గాజువాకలో విలేకర్లతో మాట్లాడుతూ, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పరిశ్రమలను మూసేయగా, కొన్నింటిని ప్రయివేటుకు కట్టబెట్టిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సైతం వందశాతం వాటాలను ప్రయివేటుకు అమ్మేయాలని చూస్తుంటే, కార్మికుల ఉద్యమంతో అది ఆగిందన్నారు ఈసారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్ముడు పోవడం ఖాయమన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎపికి ప్రత్యేకహోదా సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్‌తో పాటు అనేక పరిశ్రమలను పరిరక్షించి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీ కరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిర్వహించిన డిక్లరేషన్ సభ విజయం పై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని టిడిపి, వైసిపి రెండూ బిజెపి గూటి పక్షులేనన్నారు. చెల్లుబోయిన నాయుడు, అస్మిత్‌ఆలీ, అప్పలరాజు,పాల్గొన్నారు

వెంకటేశ్వర్లురెడ్డి మృతికి సిపిఎం ఘననివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని జీడిగుప్ప గ్రామంలో సిపిఎం మాజీ సభ్యుడు వాళ్ల వెంకటేశ్వర్లు రెడ్డి గుండెపోటుతో ఆదివారం మరణించారు. ఆయనకు భార్య సూరమ్మ, కుమారుడు వల్ల రాజు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్లురెడ్డి భౌతికకాయాన్ని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కొండారెడ్డి, ఖాదర్, సిహెచ్ సుబ్బారావు తదితరులు సోమవారం సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ వెంకటేశ్వర్లురెడ్డి కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సిపిఎం సభ్యునిగా జీడిగుప్ప పంచాయతీలో అంకితభావంతో పని చేశారని, ప్రజలకు ఎంతో సేవ చేశారని, ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారని చెప్పారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు గొల్ల లచ్చిరెడ్డి, కదల రామిరెడ్డి, కెచల చిన్న వెంకటరెడ్డి, ములకపల్లి శాఖ సభ్యుడు ముసలి ప్రశాంత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, ప్రజలు

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం!

ప్రజాశక్తి -తగరపువలస: ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలని ఎన్నికల సంఘం ఒకవైపు హుకుం జారీ చేస్తుంటే, క్షేత్రస్థాయిలో అమలులో వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ సరుకుల పంపిణీ చేసే వాహనంపై సిఎం జగన్‌మోహన్ రెడ్డి బొమ్మ ఇంకా అలాగే ఉంది.పలు వీధుల్లో ఈ తరహా వాహనాలు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? లేక పర్యవేక్షణా లోపమా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనాసంబంధిత అధికారులు ఎన్నికల నియమావళి అమలులో లోపాలను సరిదిద్దుకోవాలని, వివక్షకు తావులేకుండా ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఉద్దేశ్య పూర్వకంగా ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం చేస్తే వారే బాధ్యులౌతారన్న విషయాన్ని గుర్తించాలని పలువురు అంటున్నారు.

డిక్లరేషన్ సభ విజయంపై హర్షం : పాశర్ల

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాకుండా పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని కాంగ్రెస్ నేత పాశర్ల ప్రసాద్ అన్నారు. సోమవారం పౌరగ్రంథాలయంలోవిలేకర్లతో మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ వేదికగా నిర్వహించిన డిక్లరేషన్ సభ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సభలో కాంగ్రెస్ ముఖ్యనేతలు తమ వైఖరిని స్పష్టం చేశారన్నారు. ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఇప్పటికే స్పష్టం చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రభుత్వరంగసంస్థల పరిరక్షణతోపాటు ఎపికి ప్రత్యేకహోదా వస్తుందన్నారు. హిందువులపై దాడులు జరిగినా పట్టించుకోని బిజెపి, హిందుత్వ ముసుగులో ఓట్లు దండుకుంటోందన్నారు. బాబు, జగన్, పవన్‌లు బిజెపి గూటి పక్షులేనన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, పాలన పూర్తిగా గాడీ తప్పిందన్నారు టిడిపిలో పనిచేసేవారికి గుర్తింపు లేదని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు